# కవితా కౌముది

## ఎప్పుడూ నూతనత్వమే..
### శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ

మానవ జీవన సంరావంలో
శ్రుతిచేసుకునే కాలగీతంలో
మళ్ళీ ఒక క్రొత్తపాటకై
క్రొత్త లయ...క్రొత్త బాణీ....!
రాగవిస్తృతిలోపొదిగే
నూత్నరాగాల విపంచిపై
మళ్ళీ మరో క్రొత్త ఆలాపన...!
పండుటాకుల్ని రాల్చేసుకున్న శిశిరానికి....
ఏ ఊహల వసంతాల చిగుర్లు
విచ్చుకుంటాయో ఎలా తెలుసు....!?
ఒక్క అన్వీక్ష మాత్రం
ఆమని వస్తుందని
ఆశల పల్లకిలో తనను ఊరేగిస్తుందని....
ఆ ఊరేగింపు
తన ఆశలకు శ్వాస ఔతుందని ఒక్కటే ఆశంస....!
కాలగతిలో విచ్చుకునే
ఉత్సవాల మహస్సులన్నీ
మన సొంతం కావాలని
ఆసొంతం అమృత గీతం ఆలపించాలనీ
ఆకాంక్షించడమే
మానవ ధర్మం....మన ధర్మం!
ఎప్పుడూ నూతనత్వాన్ని , నూతనోత్సాహాన్ని ఆహ్వానిద్దాం!
క్రొత్త యేటి పాటకు ఏరువాక చినుకౌదాం!

★★★

## ఇష్టం ఒడ్డున
### చందలూరి నారాయణరావు

అతడు తన గాయాలకు
ఆమెను ఔషధంగా
హృదయంలో నాటుకున్నాడు...!
ఆమెకు మొలిచాక తెలిసింది
ఓ కథకి పునాదినని
ఓ కలకు తీపి నిద్రనని...!
కానీ ఓ అబద్ధంలా ఈ నిజం
మనసుపై యుద్ధం చేసినా...
ఆమే రాత్రి అతడికి
అతడే పగలు ఆమెకు!
ఏ కలకు జత కూడని నిజంతో
క్షణమాగని వీరి ప్రయాణంలో
అతడు ఎంత నడిచినా
ఆమె దూరమే
ఆమె ఎంత దూరంగా ఉన్నా
అతడు దగ్గరే!
ఇదే లోతుగా
ప్రవహించే జీవనదిలా
ఇష్టం ఒడ్డున
ఒంటరిగా
ఎవరికి వారే
ఇంకొకరి వైపు పొంగుతుంటారు.

★★★

# ఆమెకు శీర్షిక లేదు

అనూరాధ బండి

కలల్ని తుంపి
మెలకువలో పడేసే ఉదయం
ఎప్పుడు ఎక్కడ మొదలయ్యిందో

స్వేచ్ఛగా ఎగిరే పిట్టజాతి ఒకటి
బసచేసిన చోట
వేటగాళ్ళ నిలయమే ఈ మెలకువ

ఎప్పటి రెక్కలో
కొంచంగా ముగ్గులా రాలుతూ
తనొక వాకిలికి అలంకరణ అని
అంతఃకరించిన గజిబిజి లెక్కలకి
ప్రాణవాయువు అని, ప్రాణం అని

ఊపిరి కొలతలకి మురిసి
బానిస అరుపు నొక్కేసి
వడకట్టిన ఈరోజుని
నిన్న మొన్నల పోగుకి జత చేసి

అరుపు లేని పక్షి కూత విని
చిగురు రాని మావి పూత చూసి
వెన్నెల కాంచని చీకటి రాత చదివి
శిశిరపు పాటలు పాడి పాడి..

ఇది అరుపని, ఇది విరుపని
ఇక్కడ కోయిల ఇప్పుడు లేదూ అని
ఈ పూరించబడని ప్రశ్నాపత్రం స్త్రీ హృదయమని
మేఘపుదారుల్లో వంతెనలు అన్నీ రాత్రి కలలే అని

దోసిళ్ళ కొద్దీ నవ్వులు
పువ్వుల్లా వాడి.. రాలి
నేలకొరిగిన పిట్టతనం
నింగికెగసిన ఊకల పరిమళం

మరో ఉదయం; మరి ఇదే ఉదయం

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

శాశ్వతము యౌవనము నాదు స్వాంతమునకు
వయసెరుంగదు శ్రమకు తా వశము కాదు
ఎపుడు విహగమ్ము వలె నింగినేగుచుండు
రథము నెమ్మది యగు మనోరథము కాదు

మేనెరుంగనివెరుగు నా మానసమ్ము
తనువునకు లేని శక్తి నా మనసు సొత్తు
తరలునెచటికైన ప్రతిబంధకములు లేక
ఎంత దూరమేగిన గాని యిచటె యుండు

ఎప్పుడెచ్చటికో పరువెత్తు గాని
తరలి పోలేదు తాను పంజరము వీడి
మనసు పరుగిడ తనతోడ తనువు రాదు
తనువు లేకున్న మనసునకునికి యెచటొ!

ఏమి వాంఛించి మనసెప్పుడేగుచుండు?
వాయువేగాన పయనించి వచ్చుచుండు
శిరము పరువెత్తి యంఘ్రులు చేరకున్న
ఎంత పరువెత్తినను ఫలమేమి దక్కు?

అంతరంగము తిరుగు దేశాంతరముల
తనువు మనుగడ యిచటె నా స్థావరమున
తనువు మనసును కలసి యీ తలము వీడ
తలచినవి యెల్ల మదికి సాధ్యమ్ములగునొ!

COMMENTS